# దయ్యాల ఉసురు

"ఓరి తల్లో ! ఓరి చెల్లెలో ! ఎంత గోరం చేసుకున్నావె నా తల్లో ! ఎంత అన్నాయం చేసి పోయినావ తల్లా ! అంత బతకలేకపోయినావ చెల్లెలా ? బతుకంటె ఇంత రోత పుట్టింద తల్లా ! మేము పొముకుంటున్నదేముంది తల్లో ? మేము గొడ్ల బతుకు బతుకుతున్నామె అమ్మా ! మొగుడో మొద్దో కొట్టినా తిట్టినా పడి వుంటున్నామె తల్లో ! నీకా మాయదారి ఓర్పు లేకపాయె చెల్లెలా ! నానా పాట్లు పడుతున్నా, బతికి వుండామె తల్లా ! పాట్లు పడేది కాని కాలం తల్లో ! మన ఆడ పుట్టుక అట్లాంటిది చెల్లో ! మనది కానికాలం తల్లో ! ఏమి బాధలుంటె, ఇంత చేసుకోవాల బిడ్డా ? గోరమంతా నేను చూడాల్సి వచ్చిందే అమ్మా ! ఓరి తండ్రో ! ఓరి నాయనో !" గోడు విప్పి విప్పి, ఏడ్చిఏడ్చి భాగ్యమ్మకు గొంతు బొంగురు పోయింది. అలసటతో, గెసతో గొంతు ఆపింది. గుండెలు బాదుకుంది. చేతులు గాలిలో ఊపింది. ఆకాశంవైపు చూసింది. కన్నీటి చారలున్న ముఖంతో దిక్కులు చూసింది. ముందుకూ, వెనక్కూ పక్కలకూ ఊగింది. జుట్టు చిందరవందర అయింది. బార్లా చాచిన కాళ్లమీద తల వాలేసి పడిపోయింది. గెస పోసుకొని కాసేపటికి భాగ్యమ్మ తల మళ్లీ ఎత్తింది. చేతులు నెత్తిమీద పెట్టుకుని అంది:

"పుష్పా! ఇప్పుడెక్కడున్నావు. నా తల్లా? నేనుకూడ గోరం చేసినా తల్లో. ఒక్కమాట నువ్వనలేదు చెల్లో. అందరం నిన్ను చంపినాము తల్లో. ఓరి అన్నో ! ఓరి తమ్ముడో ! అక్కడ యముడి ముందు ఏమి చెప్తావు తల్లా ?"

పక్కవాళ్ల ఓదార్పుకు భాగ్యమ్మ స్వగతం ఆపింది.

మూడురోజులనుంచి భాగ్యమ్మ ఏడుస్తూనే వుంది. మొన్న పట్టపగలు భాగ్యమ్మ చెల్లెలు పుష్ప తన్ను తాను కాల్చుకుంది. నిన్న ఆస్పత్రిలో కన్నుమూసింది. బయటా లోపలా కాలి కమరిపోగా, పోస్ట్‌మార్టంలో మిగిలిన ఇరవై రెండేళ్ల కాయం గంట కిందట స్మశానంలో

బుగ్గి బూడిద అయింది. సముదాయించటానికి వచ్చేవాళ్లూ, సముదాయించి పోయేవాళ్లూ ఎక్కువగా బస్తీలోని చుట్టు పక్కల ఇళ్లల్లోని ఆడవాళ్లే. ఆడవాళ్ల దుఃఖం ఆడవాళ్లకు పట్టినంతగా మగవాళ్లకు పట్టదు. పుష్ప కన్నతండ్రి ఇంటి బయట రోడ్డులో వుండే కంకర మీద నిర్వికారంగా కూర్చున్నాడు. ఇద్దరన్నదమ్ములూ అసహనంగా నిలబడి సిగరెట్లు కాల్చుకుంటున్నారు. పోలీసు కేసు మాఫీకావడమేమో అయింది. పుష్ప, మూడు సార్లు స్పృహ వచ్చినప్పుడే యిచ్చిన మరణ్ణ వాజ్మూలం పుణ్యామా అని. తడుపులు తోడయ్యాయి. ఆ ముగ్గురు మగవాళ్లకు తమ పనుల్లోకి తాము వెళ్లాలనే వుంది. అదే బస్తీలోకి రెండు మూడిళ్ల అవతల వున్న తన ఇంటికి భాగ్యమ్మపోతే, ఆ రోజే పుష్ప వుంటూ వచ్చిన రెండు గదుల ఇంటి భాగాన్ని ఖాళీ చేసి మిగిలిన సామాన్లను పట్టుకొని పోవాలని వాళ్లకుంది. భాగ్యమ్మ తన గోడు చాలించదు. ఆమెను బలవంతంగానైనా తీసుకపోగలిగిన మొగుడు ఊళ్లోలేడు.

భాగ్యమ్మ చివాలున లేచింది. ఆకాశంలోకి చూసింది. ఎత్తినరెండు చేతుల్నీ ఊపుతూ మోర పైకెత్తి బిగ్గరగా అంది:

"చూడర్రా. అదిగో నా తల్లి. ఎట్లా వెలిగిపోతాందో చూడర్రా నాయనలారా ! ఓసి నా తల్లో అక్కడన్నా సుకంగా వుండు..."

అంటూనే భాగ్యమ్మ స్పృహ తప్పింది.

☆ ☆ ☆

"చెప్పు చెల్లీ నువ్వుపడ్డ యాతన"

"చెప్పు అక్కా"

"చూడు చెల్లీ ! నీ కష్టం మనందరి కష్టం. నీ మేలు మనందరి మేలు. చెప్పు చెల్లీ. మనసు విప్పి మాట్లాడు".

....

"మాట్లాడవేమక్కా? మాట్లాడు. ఇక్కడ మగ పురుగుల్లేవు. భయం లేదు. మాట్లాడు. నువ్వే మేము. మేమే నువ్వు మాట్లాడు".

......

చూడు చెల్లీ ! నీ దుఃఖం ఇక్కడ ఒక లిప్తకాలం. నీ యాతనా, నీ దుఃఖం గతానివి. నీ గతం నువ్వు చెప్పగానే నీకు మనసు తేలికవుతుంది. నీ బతుకు బుగ్గి చేసిందెవరెవరో పేరు పేరునా చెప్పు. గతంతో పోరాడితేనే భవిష్యత్తు . గతంతో రాజీ పడితే యుగ యుగాలు నిర్వాణం లభించదు. నిర్వాణం మన భవిష్యత్తు. మేము నిర్వాణం కోసం వర్తమానంలో వున్న వాళ్లం. నువ్వు సుఖదుఃఖాల సంధిలో వున్నావు. నీ చైతన్యం ఇప్పుడింకా మనుషుల చుట్టూ తిరుగుతూనే వుంది. నిన్ను బాధించిన వాళ్లందరికీ ఒకే ఒక శిక్ష వుంటుంది. ఆ శిక్ష అమలు కాగానే, నీ వ్యధపోతుంది. నీ దుఃఖం పోతుంది. ఆ తర్వాత మనలోకంలోకి వచ్చే స్త్రీల దుఃఖాన్ని మాత్రమే గ్రహించే భక్తి వుంటుంది. ఇప్పటి మాకులాగా. చెప్పవమ్మా -లిప్త కాలం ముగిసిపోక ముందే చెప్పమ్మా చెల్లీ".

దయ్యాల లోకం ...

బ్రహ్మాండమైన చౌకు. చౌకు నాలుగు వైపులా నూట ముప్పయి అయిదు అంతస్తుల తెల తెల్లటి భవనాలు. భవనాల ముందు దిద్దితీర్చిన పచ్చిక చాళ్లు. చాళ్ల ముందు పెద్ద పెద్ద రంగు రంగుల పూలు పూసిన చెట్లు. భవనాలమీదా, చెట్లమధ్యా ఎగురుతున్న తెల్లటి పావురాల్లాంటి జెండాలు. జెండా గుడ్డలమీద నలుపు రంగులో గొంతు నులుమబడుతున్న ఆడబిడ్డల బొమ్మలు. పదకొండు, ముప్పయి అయిదేండ్ల మధ్య వయసు మహిళల చైతన్య

సదస్సు చౌకులో జరుగుతోంది. తెలుపుమీద నలుపు పట్టీలున్న దుస్తుల్లో మహిళల అందమైన చైతన్యరూపాలు, లోకాలోకనాలు.

అక్కడ మగ సెంట్రీలు లేరు. ఆడసెంట్రీలు అసలు లేరు. సైనిక పటాలాలులేవు. తుపాకులు పట్టుకొని లేవు, ఎక్కుపెట్టి సిద్ధంగానూ లేవు. బారులుతీరిన ట్రక్కులులేవు. మొహరించిన ట్యాంకులు లేవు. తెలియని ప్రదేశం నుంచి ఎక్కుపెట్టిన ఏ ఆయుధమూ లేదు. నాయకుడూ లేడు; ఉప నాయకులూ లేరు. ఏ వ్యక్తి పూజార్హ విగ్రహమూ చౌకులో లేదు.

అది దెయ్యాల చౌకు.

ఆ చౌకులో విన్పిస్తున్న గొంతులు రెండేరెండు. - 'చెల్లీ' అంటున్న ఒక గొంతు; 'అక్కా' అంటున్న మరొక గొంతు. మాట్లాడినప్పుడు అందరూ మాట్లాడుతున్నట్లే వుంది. రెండు రకాల గొంతులుమాత్రమే విన్పిస్తున్నాయి. వాగవయవాల కదలికలు ఒకే ఒక్క భాషకు అనుగుణంగా వున్నాయి. ఇంకా పలకని ఆ గొంతు ఆ చెల్లిది, ఆ అక్కది. చౌకు మధ్య పాలరాతి తిన్నె మీద తన శరీరాన్ని కాల్చుకున్నప్పుడు ఎట్లా వుందో అట్లా వుంది. వికృతంగా, బీభత్సంగా, నగ్నంగా - శరీరానికి అంటుకున్న ఒకటి రెండు బట్ట పేలికల మధ్య, కాలి వేళ్లకు బిగుసుకుపోయిన మెట్టెలతో, ఎడమ చేతి మణికట్టుకు వేలాడే చేతి గడియారంతో, కుడి చేతికి రెండు గాజులతో,మెడకు వేలాడుతున్న ఒంటి పురిచైనుకు కొక్కెంతో అతికించిన తాళి బొట్టుతో.

"చెప్పు చెల్లీ...చెప్పు అక్కా", ఒక్కమారు ధ్వనించిన అఖిల మహిళాత్మల కంఠాల ఘోషకు మూడో గొంతు చివరకు విచ్చుకుంది. ఆ గొంతు పుష్పది.

"ఏం చెప్పమంటారు? కన్నవాళ్లేకాదు, నా బతుకును నన్నెవరూ బతకనివ్వలేదు. చివరన జతైనవాడు అన్ని నమ్మకాల్నీ ముంచిపోయాడు. పోతూ పోతూ "పోవే నీకు అలవాటే. ఇంకొకణ్ణి చూసుకో" అని పోయాడు. ఎంతమందిని ఎన్ని రోజులని చూసుకుంటూ పోవాలి. ఒకరా ? ఇద్దరా? ముగ్గురా? పదిమందా ? నేను మనిషిని కానా ? నేను కోరేది గుండె తోడున్న మగతోడు. లోకమంటే ప్రేమ లేకుండా చేసిపోయాడు".

ఈ రెండు మాటలతోనే పుష్పకు తన గుండె బరువు తగ్గినట్లు అన్పించింది. తనలో ఏదో మార్పు వచ్చినట్లు గ్రహించింది. చౌకులోని తన జాతిని చూసింది. వేల వేల ఆ ముఖాల రంగుల్లో - తెలుపు, నలుపు, పసుపు, గోధుమరంగు ముఖాల్లో పుష్పకు రంగుల తేడాలు కన్పించలేదు. వాళ్ల ముఖాల్లో మతాల, కులాల, గుంపుల మురికినీడలు కన్పించలేదు. వంచన కన్పించలేదు. ఆ కళ్లల్లో అంతులేని ఆపేక్ష.

పుష్ప తన కథను చెప్పింది:

"మాది కొండాపురం దగ్గర పల్లె. ఒకప్పుడు రైతులం. నా చిన్నతనం జొన్నచేలల్లో, కందిసాలుల్లో, పెసర చేలల్లో గడిచింది. కరువుకాటకాల వాతబడి, అప్పులై అన్నీ పోగొట్టుకొని గడవక హైదరాబాద్ చేరుకున్నాం. అప్పటికే మా అమ్మ చచ్చిపోయింది. మా నాయన ఒక ఫ్లాటులో వాచ్‌మెన్ పదవిలో కుదిరాడు. మా అక్క పనిమనిషైంది. మరొక ఫ్లాటు వాచిమెన్ను పెళ్లి చేసుకుంది. మా తోడ బుట్టిన వాళ్లందరూ కూరగాయల బండ్ల వ్యాపారం చేసేవాళ్లు. వాళ్లవి వేరు వేరు కాపురాలు. నా బతుకు వేరు దారిలో నడిచింది.

నాకప్పుడు పదమూడేళ్లు. ఢిల్లీలో పనిచేసే ఆఫీసర్‌కు పనిపిల్ల కావాలని మా నాయనను ఎవరో అడిగారు. నాకేవో ఆశలు చెప్పాడు మా తండ్రి. 'పైగా విమానంలో తీసకపోతారంట' అన్నాడు. అట్లాగే అయింది. వెళ్లేప్పుడు విమానంలో వెళ్లాను. ఢిల్లీ ఆఫీసరు

బంగళాలో ఫాషన్లూ, షోకులూ, పార్టీలూ, విందులూ, హై క్లాసు వాళ్ల మధ్య నా జీవితం గడిచింది. హిందీ అబ్బింది. మర్యాదలబ్బాయి. ఆత్మకు పై జీవితం అబ్బింది. రెండేళ్లుంచుకున్నారు వాళ్లు. తిప్పి హైదరాబాద్‌కు విమానంలోనే పంపారు. నేనేదో తప్పు పని చేసి వుంటానని అందుకే తిప్పిపంపారని మా నాయన తిట్టి తిట్టి చంపాడు.

గాలిలో రెండుమార్ల ప్రయాణం. నేను చూడడానికి చాలా బాగుంటానని సినిమాల్లో చేర్పిస్తానన్నాడు- మా అన్న స్నేహితుడొకడు. నేను గాలిలో తేలిపోయా. నన్ను ఏట్లో ముంచాడు. అట్లా వరుసగా ఒకరు గోదావర్లో ముంచారు. మరొకరు క్రిష్ణలో ముంచారు. ఒకరు కావేరిలో, మరొకరు కూములో. చివరన ముంచింది మూసీ కుళ్లు నీటిలో - ఆ సేటు నా బతుకు నేను బతకడానికి వీల్లేకుండా చేశాడు.

ఆ దినం...

సేటు వచ్చాడు. మా సమ్మందం తెగ తెంపులైపోయింది. అందుకు చింత పడలేదు. నన్నొక మనిషిగా చూడలేకపోయిన వాళ్లందరూ జ్ఞాపకానికి వచ్చారు. తండ్రికీ, తోడబుట్టిన వాళ్లకూ నా డబ్బయితే పనికి వచ్చింది. నేనుగా కాదు. మొదట 'సై' అన్నవాళ్లే కష్టంమీది కొచ్చే వేళకు 'నీతి లేని దాని బతుకంతే' అన్నారు. అందుకే...అందుకే...

"సరే కాల్చుకున్నావు చెల్లీ... కాలిపోయావు అక్కా. మన బాధితుల ప్రజాస్వామ్యం వీళ్లందరికీ ఒకే ఒక శిక్ష వేస్తుంది. చెప్పు ఏ శిక్ష ? ఏ రకం శిక్ష? .. నువ్వు చెప్పింది అమలవుతుంది."

ప్రేమ పూరితమైన ఆ వాక్కుకు పుష్ప చలించిపోయింది. గద్గద స్వరంతో చెప్పింది.

"కుక్క బుద్దులు ఏ శిక్షకు లొంగుతాయి? ఏ శిక్షకు కుక్క తోకల వంకర్లుపోతాయి? 'నేనిచ్చిన నగలు నా పెళ్లానివి ఇచ్చెయి. నేను కొన్న చీరలు నా భార్యకు కొన్నవి ఇచ్చెయి' అని ఈ మెడ తాడు తప్ప, కాల్చుకున్న కట్టుడు చీర తప్ప అన్నీ ఒలుచుకునిపోయిన మగబుద్ధి ఏ శిక్షకు లొంగుతుంది ? మంటల మధ్య గొంతు తడి ఆరి, 'నీళ్లో', 'నీళ్లో' అని మొత్తుకుంటే, దగ్గరకు రావడానికే భయపడిపోయిన బుద్దులు చక్కనవుతాయా ? శిక్ష అంటూ వేస్తే, మగజాతి దిసమొలతో బతికేట్లు వెయ్యండి. మన వాళ్లకు భయం తొలగిపోయేదాకా గొంతు తడి ఆరేట్లు శిక్ష వెయ్యండి..."

"వెయ్యండి ... వెయ్యండి" కాదు ....

"వేస్తున్నాం .... వేస్తున్నాం" అందరిదీ ఒకే కంఠం !

☆ ☆ ☆

వేల వేల కంఠాల ఒకే స్వరం ! ఒకే నాదం!

కలగా పులగంగా పెట్టిన భక్తి పాటల హోరుకు బెదిరి, మగతలో నుంచి లేచినట్లు లేచి రోడ్డు మీదికి వచ్చి భాగ్యమ్మ అరిచింది.

"ఒరేయి ఎందుకట్లా చూస్తారు? ఒంటిమీద బట్టల్లేవు చూసుకోండి - మీరేం మగవాళ్లురా. బట్టల్లేని వాళ్లు. గొంతెండి పోతాంది.... గుక్కెడు నీళ్లివ్వర్రా ... భయపడొద్దు ... నీళ్లివ్వండ్రా ... మీరూ నాలాగే చస్తున్నార్రా ... మా చెల్లెలు పుష్పబతుకూ. చావూ మనందర్నీ ఎడాపెడా కొడతాంది. ఈ కునాశి బతుకెందుకు? .... చస్తాం. చావండి ... చస్తే... అమ్మో... నాయనో... దప్పిక.... దప్పిక..."

కింది పెదవి మీదకూ, పై పెదవి మీదకూ నాలుకను ఆడించి ఆడించి పెదాలను తడుపుకుంటూ తడుపుకుంటూనే వుంది భాగ్యమ్మ. ○

● 7 జనవరి 1996, ఈనాడు ఆదివారం ●